క్లుప్తంగా

బీరువా బహూకరణ



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయి జెడ్పీ ఉన్నత పాఠశాలకు జగ్గునాయక్‌తండాకు చెందిన బాణోతు సుధాకర్ తన తండ్రి సైదానాయక్ జ్ఞాపకార్థం రూ.14వేల విలువ చేసే బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా దాతను హెచ్‌ఎం హరికిషన్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాజిద్, అంజయ్య, యజ్ఞాని, లక్ష్మి, మస్తాన్, ఆడమ్, శేఖర్, గంగా ఉన్నారు.

రాయినిగూడెం వాసికి డాక్టరేట్



పూర్ణచందర్‌రావును అభినందిస్తున్న ప్రొఫెసర్

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన గుండు పూర్ణచందర్‌రావుకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టర్ బీబీ నరసింహ పర్యవేక్షణలో ఐటీ విభాగంలో ఆన్ ఎఫెక్టివ్ మెకానిజం ఫర్ ఫేక్ న్యూస్ డిటెక్షన్ అనే అంశంపై ఆయన పరిశోధన చేసి సమర్పించినందుకు గాను ఆయనకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పూర్ణచందర్‌రావుకు డాక్టరేట్ రావడం పట్ల మంగళవారం కుటుంబసభ్యులు మాజీ సర్పంచ్ గురువయ్య, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్యవైశ్య మహిళా సంఘం కోశాధికారిగా వెంకటలక్ష్మి



వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న సభ్యులు

హుజూర్‌నగర్ : ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా కోశాధికారిగా హుజూర్‌నగర్‌కు చెందిన ఆలేటి వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో పట్టణ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఝున్సీ, జ్యోతి, రమాదేవి, సహాయ కార్యదర్శులుగా శ్యామల, మణి, పుష్ప, అనురాధను ఎన్నుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమ, శ్రీధర్, విజయలక్ష్మి పాండు, వి.పద్మావతి, పి.సోమలక్ష్మి, వి.నరసింహారావు, మాశెట్టి అనంతరాములు, బి.రామారావు, పి.నాగరాజు, కె.పాపారావు, పి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



పొట్టా జగన్‌మోహన్‌రావుకు బొకే అందజేస్తున్న స్థానికులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో ఇటీవల రిటైర్డ్ ఉద్యోగులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పద్యాలు, క్రీడా సాహిత్య సాంస్కృతిక పోటీల్లో రిటైర్డ్ ఉపాధ్యాయుడు, రిటైర్డ్ ఉద్యోగుల కౌన్సిల్ సభ్యుడు పొట్టా జగన్‌మోహన్‌రావు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీ ప్రజలు ఆయన నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో బొడ్డు వీరయ్య, మట్టపల్లిరావు, కస్తూరి రాములు, కేతిరెడ్డి రాంరెడ్డి, బెల్లంకొండ గోవర్ధన్, రామినేని సత్యనారాయణ, చామర్తి బ్రహ్మం, గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి, డోర్నిస్, చంద్రం, వెంకటరాంరెడ్డి ఉన్నారు.

1 నుంచి అరవింద ధ్యాన మందిర ఉత్సవాలు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి 4 వరకు అరవింద ధ్యాన మందిర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధ్యాన మందిర కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం గడ్డిపల్లిలో ఏడు గ్రామాల ముఖ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీఅరవింద ధ్యాన మందిర 53వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేడుకల్లో పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఘంటా సుధాకర్‌రెడ్డి, సుందరి నాగేశ్వరరావు, కుత్బుషాపురం మాజీ సర్పంచ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండలంలోని రెడ్లకుంటలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ సైదా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, పరిశ్రమల యజమానులు, గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బేస్‌మెంట్ దశలో ఇందిరమ్మ ఇళ్లు

- ఫైలెట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో ముమ్మరంగా నిర్మాణ పనులు
- కోదాడ నియోకవర్గంలోని ఆరు గ్రామాల్లో 279, గరిడేపల్లిలో 60
- జియోఫెన్సింగ్, జియోకోర్డినేట్‌తో అక్రమాలకు చెక్



నడిగూడెం మండలం కేఆర్పీపురంలో బేస్‌మెట్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు



గరిడేపల్లి మండల కేంద్రంలో..

కోదాడరూరల్/గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. కోదాడ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో, అదేవిధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కోదాడ నియోజకవర్గంలో ప్రస్తుతానికి 279 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ముగ్గు పోసి నిర్మాణ పనులను ప్రారంభించారు. వాటిలో కొన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రస్తుతం బేస్‌మెంట్ దశలో ఉన్నాయి. గరిడేపల్లి గ్రామానికి మొత్తం 441 ఇళ్లు మంజూరయ్యాయి. మరో 180 ఇళ్లకు ప్రతిపాదనలు పంపారు. కాగా 60 ఇళ్లకు అధికారులు ముగ్గు పోయగా అక్కడ కూడా నిర్మాణాలు బేస్‌మెంట్ దశలో ఉన్నాయి.

ఆరు మండలాల్లో ఇలా..

కోదాడ మండలంలోని గుడిబండలో మొదటి విడత అర్హుల జాబితాలో 271 మందికి గాను 51 మంది పనులు ప్రారంభించారు. అనంతగిరి మండలంలోని లకారంలో 151 మందికి గాను 69 మంది, నడిగూడెం మండలం కేఆర్పీపురంలో 296 మంది గాను 87 మంది, మోతె మండలంలోని విభలపురంలో 161 మందికి గాను 65 మంది, మునగాల మండలంలోని తాడువాయిలో 265 మందికి గాను 23 మంది, చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెంలో 25 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించా రు. మరికొందరు ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసినా జియోట్యాగ్‌లో సాంకేతిక లోపంతో జియో కోఆర్డినేట్ చేయడం ఆలస్యంతో పనులు ప్రారంభించలేదు.

నాలుగు విడతల్లో నగదు జమ..

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం రూ.5లక్షల నగదును నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుంది. బేస్‌మెట్ లెవల్‌లో రూ.లక్ష, గోడలు, స్లాబ్ దశకు చేరుకున్నాక రూ. లక్ష, స్లాబ్ పనులు పూర్తి అయిన తర్వాత రూ.2 లక్షలు, ఫినిషింగ్, టాయిలెట్స్, ఇంటీరియల్ పనులన్నీ పూర్తయిన తర్వాత చివరి రూ.లక్షను విడుదల చేయనుంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక తోలుకునేందుకు డీడీలు కట్టిను లబ్ధిదారులకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ప్రస్తుతానికి లబ్ధిదారులు తమ సొంత ఖర్చులతో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కాగా, ఇళ్లు మంజూరు కావడం పట్ల పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జియోఫెన్సింగ్‌తో అక్రమాలకు చెక్..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలకు చోటు లేకుండా ప్రభుత్వం జియోట్యాగ్ విధానాన్ని అమలు చేస్తోంది. పేదలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ఇల్లు నిర్మించబోయే స్థలాన్ని ఫొటో తీశారు. ముగ్గు పోసిన వెంటనే జియోఫెన్సింగ్‌తో పాటు జియో కోఆర్డినేట్ చేసి ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ తర్వాత బేస్‌మెంట్, స్లాబ్ లెవల్, మొత్తం పనులు పూర్తయిన తర్వాత నాలుగు విడతల్లో ఫొటోలు దిగి అప్‌లోడ్ చేస్తేనే విడతల వారీగా బిల్లులు రానున్నాయి. ఇదివరకే కట్టుకున్న ఇళ్లకు, మధ్యలో వదిలేసిన ఇళ్లకు, పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసేటువంటి అక్రమాలకు చెక్ పడినట్లు అయింది.

నిబంధనల మేరకే ఇళ్లు నిర్మించుకోవాలి



కోదాడ నియోజకవర్గంలోని ఆరు పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో 279 ఇళ్లు గ్రౌండింగ్ జరిగింది. జిల్లాలో కోదాడ నియోజకవర్గంలోనే అత్యధిక ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. లబ్ధిదారులు నిబంధనల మేరకు 500 చదరపు అడుగులలోపే ఇళ్లను నిర్మించుకోవాలి. ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపడక ఇబ్బందులు పడే అవకాశం ఉంది. మున్సిపాలిటీల్లో కూడా రీ సర్వే జరుగుతోంది. సర్వే పూర్తి కాగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో కూడా పనులు ప్రారంభిస్తాం.

– జేఎస్‌ఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ, కోదాడ

గరిడేపల్లికి 441 ఇళ్లు మంజూరయ్యాయి



గరిడేపల్లికి 441 ఇండ్లు మంజూరయ్యాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో గ్రామంలో ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తున్నాం. ఇళ్లు ప్రస్తుతం బేస్‌మెంట్ దశలో ఉన్నాయి. మంత్రి ప్రత్యేక చొరవ చూపించడం గ్రామ ప్రజల అదృష్టంగా భావిస్తున్నాం.

– త్రిపురం అంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, గరిడేపల్లి

సంతోషంగా ఉంది



నాకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరయింది. మా సొంత ఖర్చుతోనే ప్రస్తుతం ఇల్లు నిర్మిస్తున్నాం. ప్రభుత్వం నుంచి డబ్బులు మంజూరైతే మిగతా పనులు చేపడతాం. ఇంటి బిల్లును వెంటనే మంజూరు చేయాలి. ప్రభుత్వం మాకు ఇల్లు మంజూరు చేయటం సంతోషం ఉంది.

– పెండెం చంద్రకళ, లబ్ధిదారురాలు, గరిడేపల్లి

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా



హుజూర్‌నగర్‌రూరల్ : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తున్నామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగారపు పాండు అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ మండల కార్యదర్శి పోషణబోయిణ హుస్సేన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ నాగేందర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మండలంలో నిర్వహించిన సర్వేలో ఏళ్లుగా పేరుకుపోయిన ప్రజా సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీను అమలు చేయడంతో పాటు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గోపాలపురం నుంచి బేతవోలు వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని, కుక్కలు, కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

మునగాల : పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి బుర్రి శ్రీరాములు కోరారు. మంగళవారం మునగాలలోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, మండల కమిటీ సభ్యులు బోళ్ల కృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, మామిడి గోపయ్య, వీరబోయిన వెంకన్న, గడ్డం వెంకన్న, పాల్గొన్నారు.

రాయినిగూడెంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు



వీధులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం గ్రామంలో హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విభాగం –1 స్పెషల్ క్యాంపులో భాగంగా విద్యార్థులు మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కాలవపల్లి రోడ్డు, బొడ్రాయి బజారు తదితర కాలనీల్లోని రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.నాగార్జున, ఎస్ బాలరాజు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ నరేష్, దూపటి, లక్ష్మీనారాయణ, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జేసీసీటీఓ సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకుందాం



ఉగాది పండుగ విశిష్టతపై ప్రచారం చేస్తున్న పోకల వెంకటేశ్వర్లు, భక్తులు

గరిడేపల్లి : తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకుందామని టీపీసీ బోర్డు మాజీ మెంబర్, బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో మహిళా భక్తులతో కలిసి ఉగాది పండుగ విశిష్టతను తెలుపుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలకు తలమానికంగా ఉగాది పంచాంగ శ్రవణం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బొలిశెట్టి వినోద, మరికంటి యశోద, బాల్ను వరమ్మ, నాగమణి, బత్తిని సుగుణమ్మ, పోకల రాజేశ్వరి, పోకల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మునగాల: జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని విమర్శిస్తే ఊరుకునేది లేదని, మాజీ మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సూర్యాపేటలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ్, పద్మావతిపై కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా వారు గత 30 ఏళ్లుగా నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసర్ల కోటయ్య, ఎలక నరేందర్‌రెడ్డి, కాలె సామియేలు, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము ఈదారావు, పనస శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెక్కెళపాటి సాయి, నాయకులు చిర్రా శ్రీను, నాగరాజు, శ్రీను, పాషా, రమేష్, నవీన్, వీరబాబు, మహేష్ పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌లో మంటలు

- మిర్చి ఘాటుతో ఇబ్బందులు పడిన ప్రజలు

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సమీపంలో గల సాయి తిరుమలగిరి అగ్రి ప్రొడక్ట్స్ మిర్చి కోల్డ్ స్టోరేజ్‌లో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. కోల్డ్ స్టోరేజ్ తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో పది కిలో మీటర్ల దూరంలో ఉన్న కోదాడ మండలంలోని రెడ్లకుంట, కూచిపూడి, నల్లబంగూడెం, చిమిర్యాల, దోరకుంటతో పాటు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోదాడ పట్టణ ప్రజలు మిర్చి ఘాటుతో దగ్గు, తుమ్ములు వచ్చి ఇబ్బందులు పడ్డారు. ఏం జరిగిందో తెలియక గంట సేపు ప్రజలు ఆందోళన చెందారు. విషయం వాట్సాప్‌లో తెలియడంతో జాగ్రత్త పడ్డారు.

అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

మఠంపల్లి : మండలంలోని కాల్వపల్లితండా, కొత్త దొనబండతండా, పాతదొనబండతండా, అల్లీపురం గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న మఠంపల్లి మండల ట్రాన్స్‌కో అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మఠంపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వసూళ్ల విషయమై ఉన్నతాధికారులు విచారణ జరపాలని కోరారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

కోదాడ : కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించడంతో అది రుజువైందని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు ఈదుల కృష్ణయ్యయాదవ్ అన్నారు. మంగళవారం కోదాడలో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. కుల గణన చేపట్టి బీసీలకు తగిన న్యాయం చేశారని, బీసీలు కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ అండగా ఉంటారని అన్నారు. సమావేశంలో పెరిక సంఘం రాష్ట్ర నాయకుడు రామినేని శ్రీనివాసరావు, ముదిరాజ్ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు ముసి శ్రీనివాస్‌ముదిరాజ్, గౌడ, యాదవ, దళిత సంఘం నాయకులు మట్టపల్లి శ్రీనివాసగౌడ్, శ్రీనివాసరావు, మందా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మునగాల : మండలంలోని కలకోవలో గల డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీలో మంగళవారం ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాసర్ల కోటయ్య, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్, పార్టీ సీనియర్ నాయకులు దొంగరి అప్పారావు, గన్నా నరసింహారావు, చిర్రా శ్రీనివాస్, నాగార్జునపు నరసింహాచారి, సిద్దుల వీరయ్య, వీరయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, నాగయ్య, వీరబాబు పాల్గొన్నారు.

నాంచారమ్మ, యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

నడిగూడెం : మండలంలోని సిరిపురం సాగర్ ఎడమ కాల్వ కట్టపై గల నాంచారమ్మ, యల్లమ్మ ఆలయ తొలి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కాంటాల పరిశీలన

హుజూర్‌నగర్ : పట్టణంలోని రేషన్ షాపులలో ఉన్న ఈపాస్ మిషన్, ఐరిస్, ఎలక్ట్రానిక్ కాంటాలను సాంకేతిక సిబ్బంది మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాటి పనితీరును పరిశీలించి, సరిగా పనిచేయని కొన్ని మిషన్లకు మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో టెక్నీషియన్లు జగదీష్, నాగరాజు, సంపత్ కుమార్, సురేష్, మహేష్, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహా



చిలుకూరు జెడ్పీ హెచ్‌ఎస్‌లో విద్యార్థులతో కలిసి ప్రార్థన చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిలుకూరు : విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ అన్నారు. మంగళవారం చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలను ఉదయం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థనలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారు.. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది.. పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను వారు అడిగి తెలుసుకున్నారు. అన్ని సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థులు తెలపడంతో పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌ఎంఎంఎస్‌లో ప్రతి ఏడాది జిల్లా ర్యాంక్‌లతో పాటు పది మంది విద్యార్థులు ఎంపికవుతున్నారని తెలియజేయడంతో ఉపాధ్యాయులను కలెక్టర్, ఎస్పీ అభినందించారు. పాఠశాలలో మన ఊరు – మన బడి కింద మంజూరైన గదుల నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు రాజారాం, కై లాసం వెంకటేశ్వర్లు, గుండు ఆదినారాయణ, రామారావు, కోదండ రామయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



కోదాడ : మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

కోదాడ : పట్టణంలో వందశాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మున్సిపల్ అధికారులకు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్, తాగు నీటి సరఫరాపై మంగళవారం కోదాడ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ.. కోదాడ పురపాలక సంఘం పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ రుసుం రాయితీని సద్వినియోగం చేసుకొని 1300 మంది తమ స్థలాలను రెగ్యులరైజ్ చేసుకున్నట్లు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ 25 శాతం రాయితీ అవకాశం ఈ నెల 31 వ తేదీ వరకు ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో అన్ని వార్డుల్లో తాగునీరు సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, మేనేజర్ రమేష్, డీఈఈ సాయి లక్ష్మి, జూనియర్ అకౌంట్స్ అధికారి శారద, రెవెన్యూ అధికారి అనిత, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఎం.ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ పి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు సబ్సిడీపై డ్రోన్



మహిళా రైతు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న ఏడీఏ ఎల్లయ్య

మునగాల : ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీతో మండలానికి ఒక వ్యవసాయ డ్రోన్ పరికరం మంజూరు చేసినట్లు కోదాడ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది మహిళా రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి బ్యాంకు ద్వారా రుణం పొంది డ్రోన్ పొందవచ్చన్నారు. మహిళా గ్రూపులో తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేసిన ఒక మహిళ ఉండాలన్నారు. కావాల్సిన మహిళా రైతులు స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా మహిళా రైతులకు ట్రాక్టర్‌తో పొలంలో బోదెలు, గట్టు చేసే యంత్రానికి రూ.1.20 లక్షల సబ్సిడీ ఉందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మంగళవారం ట్రాక్టర్ పనిముట్లకు ఒక దరఖాస్తు, పవర్ స్ప్రేయర్లకు ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి.రాజు, వ్యవసాయ విస్తరణాధికారులు రమ్య, భవాని, రేష్మ, నాగులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మునగాలమ్మ జాతర



జాతరలో ఏర్పాటు చేసిన లైటింగ్ ప్రభ

మేళ్లచెరువు : మండలంలోని హేమ్లాతండాలో గిరిజనుల ఆరాధ్యదైవం మునగాలమ్మ జాతరను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి లైటింగ్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాణోతు బాబు, భూక్యా రాజమ్మ జయరాం నాయక్, భిక్షం, మాజీ ఎంపీటీసీలు భూక్యా సోమనాయక్, టీకం, యూత్ కాంగ్రెస్ నాయకులు సుధాకర్ నాయక్, రమేష్‌నాయక్, వంశీ, గ్రామస్తులు బాలు, నెహ్రూ, నాగేశ్వరరావు, భగవాన్, బోయినాయక్, నరసింహ, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష

మోతె : మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మంగళవారం మోతె తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో తహసీల్దార్ బి. శ్రీకాంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఏయే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి, తదితర అంశాలపై అధికారుల అభిప్రాయాలను తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారిని అరుణ, ఏపీఎం వెంకయ్య, ఏఈఓలు, ఐకేపీ సీసీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడితే నిర్బంధించడం సరికాదు

కోదాడరూరల్ : హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలను నిర్బంధించడం సరికాదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌రాజు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్‌లో హక్కుల కోసం పోరాడుతున్న రైతులపై, శంబూరి ప్రాంతంలో వేసుకున్న గుడారాలపై బుల్డోజర్‌లతో తొక్కించి వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు తరహా పోకడలతో దేశ ప్రజలను నియంతృత్వ పద్ధతిలో పాలించాలనుకుంటుందని ఆయన విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే రద్దు చేయాలని వచ్చే నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, ఉదయగిరి, నవీన్, శ్రీను, రవిఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా పోరాడుదాం

గరిడేపల్లి : టోల్‌గేటు రుసుం విషయంలో రాజకీయాలకు అతీతంగా పోరాడుదామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండల అంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ అన్నారు. మంగళవారం టోల్‌గేట్ విషయంపై మండల కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. 50 కిలోమీటర్ల లోపు, గరిడేపల్లి మండలానికి టోల్‌గేట్ రుసుం లేకుండా ఉండేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. సింగిరెడ్డి, వీరయ్య, జెనిగల శ్రీనవాస్, దోసపాటి భిక్షం, చామకూరి అంజి, కీసర నాగయ్య, సతీష్, నరసింహారావు, గుండు సైదులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం ఎస్‌ఐ గందమళ్ల అజయ్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి, ఏఎస్‌ఐ మల్సూర్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన కొండా వర్మ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో కాలుకు సర్జరీ చేయాల్సి వచ్చింది. వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో నిరుపేద కుటుంబానికి చెందిన వర్మ పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సొందుమియా కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వర్మ ఆపరేషన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎమ్మెల్యే రూ. 2 లక్షల ఎల్‌ఓసీ ఇచ్చినట్లు సొందుమియా తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మునగాల : మునగాల శివారులో జాతీయ రహదారిపై మంగళవారం ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఉండ్రుగొండ శివారులో గల పాలేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ డ్రైవర్ కొండ వీరయ్య రేపాల గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కోదాడ మండలం కొత్తగూడెం గ్రామ శివారులో గల పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా మునగాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో పట్టుకొని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిరోజూ ధ్యానం చేయాలి

నడిగూడెం : ప్రతిరోజూ ధ్యానం చేయాలని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో కొనసాగుతున్న ధ్యానంపై అవగాహన కార్యక్రమంలో మంగళవారం వారు మాట్లాడారు. ప్రస్తుత జీవనశైలిలో మార్పులతో అనేక రకాల జబ్బులు సోకుతున్నాయన్నారు. నిత్యం శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని, జబ్బులు కూడా సోకవన్నారు. ఈ కార్యక్రమంలో మండవ వెంకటేశ్వరరావు, భవ్వరిశెట్టి వెంకటరత్నం, మొత్కూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.